విశాలాంధ్ర

శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

మంగళవారం 06, ఆగష్టు-2024 4 పేజీలు

అర్జీలను వెంటనే పరిష్కరించాలి-డిఆర్ఓ లవన్న

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : ప్రజాసమస్యలపరిష్కార వేదికలో వచ్చినఅర్జీలనుసత్వరమే పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులను జిల్లా రెవిన్యూ అధికారి లవన్న ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన అర్జీదారులు తమ తమ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు అందజేశారు. ఈ సందర్భంగా డిఆర్ఓ లవన్న మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేస్తున్నటువంటి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలన్నారు. నిర్దేశిత సమయం లోగా పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సరైన పరిష్కారం చూపకుండా అర్జీలను మూసివేయడం తగదన్నారు. అర్జీలను మొక్కుబడిగా కాకుండా సమస్య మూలాల్లోకి వెళ్లి పరిశీలించి తిరిగి ఆయా సమస్యలు పునరావృతం కాకుండా ఉండేవిధమైన పరిష్కారానికి కృషి చేయాలన్నారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి డి ఆర్ ఓ తో పాటు జడ్పీ సి ఇ ఓ కన్నమనాయుడు, డి ఆర్ డి ఎ పిడి సాంబాశివా రెడ్డి అర్జీలు స్వీకరించారు.

మాజీ మంత్రి కాకాని అనుచరుడు 40 కోట్ల భూదోపిడి

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తీవ్ర ఆరోపణ

విశాలాంధ్ర:- మనుబోలు : మనుబోలు మండలం కొమ్మలపూడి గ్రామానికి చెందిన చెందలూరు శ్రీనివాసులు కాకాని అనుచరుడు 40 కోట్ల మేర భూదోపిడికి పాల్పడ్డారని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి విమర్శించారు. సోమవారం అయినా మనుబోలు మండలం కొమ్మలపూడి రోడ్డు హైవే సమీపంలోని లేఔట్ లో విలకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకాని కుడి భుజం చెందలూరు శ్రీనివాసులు రూ.40 కోట్లు విలువచేసే ఇరవై ఎకరాలు భూదోపిడికి పాల్పడ్డారని రెవిన్యూ అధికారులు నిద్ర వస్తువు ఉందని తెలిపారు. ప్రస్తుతం కలెక్టర్ ఆర్డిఓ తాహసిల్దార్ స్పందించి దీనిపై విచారణ జరిపించి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఎక్కడ లేని విధంగా సర్వేపల్లి నియోజకవర్గంలో పెద్ద ఎత్తున భూదోపిడి జరిగిందని త్వరలో అన్ని బయటకు వస్తాయని అన్నారు. చెందలూరు కుటుంబం 20 ఎకరాలు అధికారాన్ని అడ్డం పెట్టుకొని రెవెన్యూ రికార్డులు మార్చేశారని విమర్శించారు. నియోజక వర్గ వ్యాప్తంగా కాకాని అనుచరులు భూ దోపిడీ లక్ష్యంగా పెట్టుకుని దోచుకున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే వందల ఎకరాలు కబ్జా చేసిన వైసిపి నేతలపై విచారణ జరిపిస్తామని అన్నారు. ఆక్రమించిన భూ కబ్జాపై జిల్లా కలెక్టర్ స్పందించి వెంటనే విచారణ జరిపించాలని కోరారు. ఆయనతోపాటు మాజీ ఎంపీటీసీ పెంచలయ్య, టిడిపి మండల కన్వీనర్ గాలి రామకృష్ణారెడ్డి, రామకృష్ణయ్య , విందోటి భాస్కర్ రెడ్డి, సూరిశెట్టి నాగేశ్వరావు, సాని వెంకటరమణయ్య, మనిమాల ఆదినారాయణ రెడ్డి, ఉడత హరి బాబు, డిప్యూటీ తాహసిల్దార్ శివప్రసాద్, మండల సర్వేరు శ్రీనివాసులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

కాలేజీల పనితీరుపై వీసీ అసంతృప్తి

కాలేజీలను ఆకస్మికంగా తని చేసిన వైస్ ఛాన్సలర్ విజయ భాస్కరరావు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : విక్రమ సింహపురి విశ్వ విద్యాలయ పరిధిలోని వివిధ కళాశాలల పనితీరుపై వీసీ విజయ భాస్కరరావు అసంతృప్తిని వ్యక్తం చేశారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ పరిధిలోని కళాశాలలను విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఎస్.విజయ భాస్కర రావు ఆకస్మితంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో భాగంగా సంజీవిని డిగ్రీ కాలేజీ, రావుస్ ఇన్సిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ స్టడీస్, రావుస్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంప్యూటర్ స్టడీ, జగన్స్ కాలేజీ లోని మౌలిక వసతులను పరిశీలించారు.విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరు ఇంటర్నల్ ఎగ్జామ్సులను పరిశీలించారు. అక్కడ గుర్తించిన లోపాలను బట్టి ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. కళాశాలలు సమాజ నిర్మాణం కోసం పనిచేయాలని హితవు పలికారు. అనంతరం తరగతి గదులు, ల్యాబొరటరీస్, ఇతర వసతుల నాణ్యతను, సిలబస్ అమలు, పరీక్షా విధానం, విద్యా నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ప్రమాణాలు, పనితీరు మెరుగు పరుచు కోక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ తనిఖీలలో ఉపకులపతితో పాటు విశ్వవిద్యాలయ డీన్ డాక్టర్ యం ఉస్సేనయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే యాష్ పాండుకుగండి-మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు: సోమిరెడ్డి, ఆయన కొడుకు ధనదాహానికి యాష్ పాండ్ కు గండిపడి రైతుల పొలాలు సర్వనాశనం అయ్యాయని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు.నెల్లూరు కలెక్టరేట్ వద్ద సోమవారం ఆయనమీడియాతో మాట్లాడుతూ సోమిరెడ్డి 2019ఎన్నికలకు ముందు యాష్ పాండ్ టెండర్లు పిలిపించి, కాంట్రాక్ట్ చేసుకొని, కాంట్రాక్టర్దగ్గరడబ్బులు దండుకొని రైతుల ప్రయోజనాలను విస్మరించాడన్నారు. యాష్ పాండ్ ప్రమాదానికిబూడిద పూడిక తీత పనులకుసోమిరెడ్డి అడ్డంకిసృష్టించడమే కారణ మని విమర్శించారు.సోమిరెడ్డి, ఆయన కొడుకు నెలకు16 బల్కర్ల ద్వారా ఫ్లై యాష్ అక్రమ రవాణా చేస్తూ, నెలకు 16 లక్షలు గడిస్తున్నాడని ధ్వజమెత్తారు. సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకు సర్వేపల్లి ప్రజల క్షేమం కోసం, సంచులు తీసుకొనితిరగడం మాను కోవాలని హితవుపలికారు.సోమిరెడ్డికి తలపని చేయటం లేదని ధ్వజమెత్తారు. యాష్ పాండ్ ఘటనకు సంబంధించిప్రభుత్వం పూర్తిస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. భూముల నష్టపోయిన వారికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వడంలో కూడా జాప్యం జరుగుతుం దని జెన్కో ఎండీలుగా పనిచేసిన వారికిఅనేక సార్లుఈవిషయాన్నితీసుకునివెళ్లినవారివాటాను మాత్రంవిడుదలచేయడం లేదనివిమర్శించారు. నష్టపోయిన మత్స్యకారులు, రైతుల పక్షాన నిలబడితాము రాజీలేని పోరాటం చేస్తామన్నారు.

రైతాంగాన్నిఆదుకోవాలి

ఏపీజెన్కో యాష్ పాండ్ గండిపడి బూడిదనీరుపొలాల్లో,రొయ్యలగుంటల్లోచేరినష్టపోయిన రైతులను అన్నివిధాలా ఆదుకోవాలని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకుప్రజాసమస్యల పరిష్కార వేదికలో సోమవారం ఆయన వినతి పత్రం అంద జేశారు.బూడిదకాలుష్యంవల్ల మత్స్య సంపద కోల్పోయి, జీవనాధారంలేని మత్స్య కారులకు జీవనభృతితో పాటు నష్టపరిహారం చెల్లించాలన్నారు.ప్రభుత్వం తక్షణం స్పందించాలని లేకపోతే పోరాటం తప్పదని హెచ్చరించారు.

జిల్లాలో క్రీడలను అభివృద్ధి చేస్తాం - ఎంపీ వేమిరెడ్డి

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : కబడ్డీ...కబడ్డీ.. కబడ్డీ అంటూ మొదలైన పోటీలు ఉత్కంఠ భరితంగా సాగాయి. నువ్వానేనా అన్నరీతిలోప్రతిక్షణం విజయం జట్ల మధ్య దోబూచులాడింది.ఇందుకూరుపేట మండలకేంద్రంలోనిఎం.కే.ఆర్హైస్కూల్మైదానంలో గత మూడు రోజులుగా జరుగుతున్న11వ ఆంధ్ర రాష్ట్ర బీచ్ కబడ్డీ పోటీలు ఆద్యంతం అద్భుతంగా సాగాయి.ఆదివారంరాత్రి జరిగిన పోటీలముగింపుకు ముఖ్య అతిధులుగా నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి విచ్చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా వివిధ జిల్లాల క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ ఇందుకూరుపేటలో ఈరోజు ఒక పండుగ వాతావరణం కనిపిస్తోందని చెప్పారు. ఎక్కడ చూసినా కబడ్డీకబడ్డీకబడ్డీ అనే మాటలే వినిపిస్తున్నాయన్నారు. 11వ ఆంధ్రరాష్ట్రబీచ్ కబడ్డీ పోటీలకు చాలా ఆదరణ వచ్చిందంటే ప్రజలే కారణమన్నారు.ఈ టోర్నమెంట్‌లో ఉమ్మడి 13 జిల్లాల నుంచి13మెన్,13ఉమెన్ టీంలు పోటీ పడ్డాయని, వారందరికీ అభినందనలు క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడి పోయిన వారు బాధపడాల్సినఅవసరంలేదన్నారు. మళ్లీఅవ కాశాలు వస్తాయన్నారు. వాటినిఉపయోగించుకుని గెలుపు సాధించాలనిసూచించారు.ఫైనల్‌మ్యాచ్ఆడుతున్న ప్రతి ఒక్కరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇక్కడఆడినవారు రాష్ట్ర స్థాయిలో దేశస్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. మైదానం అభివృద్ధికి కృషి చేస్తాం.రాష్ట్రస్థాయిలో జరిగిన ఈ పోటీలను నిర్వహించిన నిర్వాహకులను ఎంపీ ప్రత్యేకంగా అభినందించారు. ముందుండి నడిపిస్తున్న దువ్వూరు కల్యాణ్‌రెడ్డిని, కమలాకర్‌రెడ్డిని, ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పముజుల రవి, పవన్‌రెడ్డి, రమేష్ నాయుడు, విజయ్‌కుమార్, ఇతర సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.గ్రామీణ స్థాయి క్రీడ అయిన కబడ్డీని ఇంకా ప్రోత్సహించాలనికోరారు. అలాగేఇందుకూరుపేటలో హైస్కూల్ పక్కన మైదానాన్ని అభివృద్ధి చేయడంపై ఇందుకూరుపేట వాసుల నుంచి వినతి పత్రం వచ్చిందన్నారు.ఇందులో ట్రాక్,మినీ ఇండోర్ స్టేడియం, వాలీబాల్ కోర్టులు, షటిల్‌కోర్టులు, ఇతరవసతులు కల్పించాలని కోరినటు చెప్పారు.ఈగ్రౌండ్‌ను ప్రభుత్వ నామ్స్ ప్రకారం అభివృద్ధి చేయడానికికృషి చేస్తామని ప్రకటించారు.దాంతో మైదానంలోహర్ష ద్వానాలు వ్యక్తంచేశారు.జిల్లాలో క్రీడలఅభివృద్ధికి తమ పరిధిలో తప్పకుండా కృషిచేస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి యలమంచిలి శ్రీకాంత్, మన్నెం సతీష్, డీఎస్‌డీవో యతిరాజ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి గురుప్రసాద్, టీడీపీజిల్లా పార్టీ ప్రధానకార్యదర్శి చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డి, కాటంరెడ్డి రవీంద్రరెడ్డి, కేతంరెడ్డివినోద్‌రెడ్డి, సీవీ సుబ్రహ్మణ్యం నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

బోగోలులో తల్లిపాల వారోత్సవాలు

43

విశాలాంధ్ర-బిట్రగుంట: మహిళా శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటినుండి ఏడు వరకు నిర్వహించు తల్లిపాల వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన బోగోలుసెక్టార్ లో సోమవారం సెక్టార్ పర్యవేక్షణ అధికారి కోటేశ్వరి ఆధ్వర్యంలో తల్లిపాలవారోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాఉన్నతాధికారులు, కావలి ప్రాజెక్టు అధికారి సౌజన్య ఆధ్వర్యంలో ప్రాజెక్టుపరిధిలోని అన్నిమండలాలలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి హాజరైన గర్భవతులు, బాలింతలకు తల్లిపాల విశిష్టతపై అవగాహన కలిగిస్తూ, తల్లిపాలుఎంతో విలువైనవని, పుట్టినబిడ్డకు ఆరు నెలలపాటు తల్లిపాలుతాగించడం వలన వ్యాధినిరోధకశక్తి పెరుగుతుందన్నారు. ప్రతియువతి గర్భవతిగా ఉన్నప్పటినుండి బలమైన పౌష్టికవిలువలు కలిగిన ఆహారాన్నితీసుకోవాలన్నారు. పై కార్యక్రమం లో మహిళాసంరక్షణ కార్యదర్శి ప్రత్యూష, ఏఎన్ఎం రత్నకుమారి, ఎం ఎల్ హెచ్ పి అనూష ,అంగన్వాడీ కార్యకర్తలు ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు,

ట్రైసైకిల్ అందజేసిన ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : సనాతన ఫౌండేషన్ ఆధ్వర్యంలో, గుడ్లూరు మండలం చేవూరు ఎస్సీ కాలనీకి చెందిన వాదినాల నాగయ్య అనే దివ్యాంగుడికి సోమవారం ట్రై సైకిల్ అందజేశారు. డాక్టర్ భవినేని అరుణ (అమెరికా) ట్రై సైకిల్ ఉచితంగా ఇవ్వగా, కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు చేతుల మీదుగా, కందుకూరులోని టిడిపి కార్యాలయంలో నాగయ్యకు అందజేశారు. గుంటూరుకు చెందిన మరోదాత పి.లక్ష్మి పంపిన నిత్యవసర సరుకులను కూడా అందించారు. కార్యక్రమంలో సనాతన ఫౌండేషన్ అధ్యక్షులు బొద్దుకూరి నారాయణరావు, సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సనాతన ఫౌండేషన్ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.

తల్లిపాలే పిల్లలకు పౌష్టికాహారం :లక్ష్మి దేవమ్మ

విశాలాంధ్ర -కందుకూరు రూరల్ : తల్లి పాలు పిల్లలకు ఇవ్వడం పిల్లలు పోష్టికంగా పెరుగు తారని కందుకూరు అర్బన్ సెక్టార్ బి సూపర్వైజర్ లక్ష్మి దేవమ్మ అన్నారు.తల్లిపాలు వారోత్స వాలలో భాగంగా పట్టణ పరిధిలోని దూబగుంట గ్రామంలో సూపర్వైజర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు 5వ రోజు తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు.ముందుగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులు, బాలింతలకు ఇచ్చే పౌష్టిక పదార్థాలతో ఎంతో అందంగా అలంకరించారు. సూపర్వైజర్ లక్ష్మీదేవమ్మ మాట్లాడుతూ పుట్టిన బిడ్డకు గంటలోపే తల్లిపాలు ఇవ్వటం వలన పిల్లలు ఎటువంటి అనారోగ్యం పాలు కాకుండా దృఢంగా ఉంటారని ఆమె అన్నారు. అంగన్వాడి కేంద్రాల ద్వారా బాధితులకు గర్భవతులకు ఇచ్చే పౌష్టికాహారం గురించి క్షుణ్ణంగా వివరించారు. తల్లి తన బిడ్డకు పాలు ఇవ్వటం వలన రొమ్ము క్యాన్సర్ వంటి రోగాలతో పాటు పలు అనారోగ్య సమస్యలు బారిన పడకుండా ఉండటం జరుగుతుం దన్నారు.పిల్లలకు అమృతం వంటి తల్లిపాలను తమ పిల్లలకు ఇవ్వడం వలన తమ అందచందాలు తగ్గుతాయని అపోహలో కొంతమంది పిల్లలకు పాలు ఇవ్వడం మానేస్తున్నారని అటువంటి తల్లులకు తల్లిపాల వలన కలిగే లాభాలపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం ప్రతి సంవత్సరం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎన్.మాధవి, ఎం.బేబీ, ఝాన్సీ, డి.అనూష, షేక్. నసీమా, షేక్. శంషాద్, బి.ఈశ్వరమ్మ, ఎం. అంజలి, జి.చెంచురత్నం, వై.స్వాతి, బి.సునీత, కొండమ్మ పాల్గొన్నారు.

రైతులకు మిరప పంటలో శాస్త్రీయ పరంగా నారు పెంపకంపై శిక్షణ

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : కృషి విజ్ఞాన కేంద్రం, కందుకూరు సీనియర్ శాస్త్రవేత్త మరియు హెడ్ డా. జి. ప్రసాద్ బాబు ఆద్వర్యంలో లింగసముద్రం మండలంలో అంబేద్కర్ నగర్ గ్రామంలో ఎస్.సి. రైతులు మరియు రైతు మహిళలకు మిరప పంటలలో నారు పెంపకం పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. మిరప నారును ప్లాస్టిక్ ట్రేలలో కోకోపిట్ ను వానపాముల ఎరువును, ట్రైకోడర్మా విరిడే కలుపుకొని విత్తుకోవడం ద్వారా నాణ్యమైన నారు తయారవుతుందని తెలిపారు. ఎకరాకు 100 గ్రాముల సంకర రకాల విత్తనం సరిపోతుందని తెలిపారు. కిలో మిరప విత్తనానికి 8 గ్రాముల ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్ఎస్ మందును, 3 గ్రాముల మాంకోజెబ్ మందును కలుపుకొని విత్తనశు ద్ధి చేసుకోవాలని సూచించారు. 1 మీటరు వెడల్పు, 15 సెంటిమీటర్ల ఎత్తు ఉండేటట్లు ఎత్తయిన నారుమడులు చేసుకొని మధ్యలో 30 సెం.మీ. కాలువలు తీయాలి. విత్తనంతో పాటు సెంటు నారుమడికి 80 గ్రా. ఫిప్రోనిల్ గుళికలను వాడినచో రసంపీల్చే పురుగులను నివారించవచ్చు. నారుమొలకెత్తిన 9వ, 15వ రోజు లీటరు నీటికి 3గ్రా కాపర్ ఆక్సి క్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే నారు నాటే పొలాల్లో జనము లేదా జీలుగ వంటి పచ్చిరొట్ట పైర్లను చల్లికొని పూతదశలో కలియదున్నుకోవడం ద్వారా నేలలో సేంద్రియ కర్బణం పెరిగి మిరపలో అధిక దిగుబడి తీయచ్చని తెలిపారు. అలాగే వాలెటివారి పాలెం మండలంలో హరిపుత్ర కూరగాయలు, తృణ దాన్యాల రైతు సంఘం విక్రయకేంద్రాన్ని పరిశీలించి వారికి కూరగాయాలలో విత్తనోత్పత్తిలో మెళకువలను తెలియజేసారు. అలాగే మిరప నారు పంపకంలో శాస్రీయ సలహాలు సూచనలను తెలియజేసారు. ఈ కార్యక్రమలో శాస్త్రవేత్తలు డా.వెంకటేష్, డా.జ్యోతి, ఇంజనీర్ వివేక్, మైరాడా ఎన్జీవో సభ్యులు మల్లికార్జున పాల్గొన్నారు.

నేడు సాగరంలో ఎస్ఎంసి కమిటీ ఎన్నికపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర -అనంతసాగరం : అనంతసాగరం మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాలలో మంగళవారం ఎస్ఎంసి కమిటీ ఎన్నికపై అవగాహన సదస్సు మధ్యాహ్నం రెండు గంటలకు ఈ కార్య క్రమం జరుగునున్నట్లు ఎంఈఓ 2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలిపారు.

తెగచర్ల అంగన్వాడి కేంద్రంలో తల్లి పాలవారోత్సవాలో బిడ్డకు తల్లిపాలే శ్రీరామరక్ష

విశాలాంధ్ర-రాపూరు: ఈ నెల 1వ తేది నుండీ 7వతేది వరకు జరుగుచున్న తల్లి పాల వారోత్సవాలలో బాగంగా రాపూ రు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఓ సునంద పర్యవేక్షణలో రాపూరు మండలంలోని గోనుపల్లి సేక్టర్‌లోని తెగచర్ల పంచాయతీ లోని అంగన్వా డి కేంద్రంలో గోనుపల్లి సేక్టర్ అంగ న్వాడి సూపర్వైజర్ రాజ్యలక్ష్మి అధ్వర్యంలో బాలింతలకు,గర్భ వతులకు తల్లి పాల విశిష్టత పై అవగాహన కల్పించడం జరిగిందని సూపర్ వైజర్ రాజ్యలక్ష్మి తెలియ జెసారు. తల్లి పాలు బిడ్డలకుశ్రీరామ రక్ష అని,ప్రతి బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే రక్ష అని, మొదటి ఆరు నెలల వరకు శిశువుకు చనుబాలె ఆహా రంగా ఇవ్వాలని.ఆరు నెలల నుండి తల్లిపాలతో పాటు అనుబం ధ ఆహా రాన్ని కూడా ఇవ్వాలని. మీ బిడ్డకు మీరు ఎంత ఎక్కువగా చను బాలు ఇస్తే అంత ఎక్కువగా పాలు ఉత్పత్తి అవుతాయని. చనుబాలు ఇవ్వడం వలన వ్యాధి నిరోధక శక్తి పెరిగి అంటువ్యా ధులు, అతిసా రం ,శ్వాసకు సంబం ధించిన వ్యాధు లు, మూత్ర నాళం మరియు చెవికి సంబంధించిన అం టూ వ్యాధుల భారి నుండి బిడ్డకు రక్షణ కలుగు తుందని. వీరిలో ఊబకాయం కూడా తక్కువ గా ఉంటుందని.జన్మించిన మొదటి గంటలోనే కేవలం తల్లి పాలు బిడ్డకు జీవ రక్షక బిందువు లు .బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లి యొక్క పసుపు రంగులోని చిక్కటి పాలు అనగా ముర్రుపాలు అమృ తం లాంటివి. వీటి ద్వారా బిడ్డకు అతి ముఖ్యమైన పోషకాలు లభి స్తాయని . సూపర్ వైజర్ రాజ్య లక్ష్మీ తెలియజెసారు. ఈ కార్యక్ర మంలో అంగన్వాడి కార్య కర్తలు, ఎఎన్ఎం,ఆశాలు, కాత్యాయిని, అం కమ్మ,దోరసానమ్మ, వేంకటరమణమ్మ పాల్గొన్నారు.

సాగరం నూతన తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన వసంతరావు

విశాలాంధ్ర-అనంతసాగరం: అనంతసాగరం మండల తహసి ల్దారుగా సోమవారం వీర వసంతరావు పదవీ బాధ్యతలు స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెవెన్యూ సమస్యలు తనని గానీ కార్యాలయ సిబ్బందితో గానీ సంప్రదింపులు జరిపి సమస్యలను నివృత్తి చేసుకోవాలని కోరారు. మండలంలోని ప్రజలు సహకరించాలని, భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. అనంతరం డిప్యూటీ తాసిల్దార్ గిరీష్ నూతనంగా బాధ్య తలు చేపట్టిన తహసిల్దార్ వసంతరవును ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు , గ్రామ రెవెన్యూ సహాయకులు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీని ఆశ్రయించిన బుజ్జిరెడ్డి

విశాలాంధ్ర -అనంతసాగరం : అనంతసాగరం మండలం ఉప్పలపాడు హైవే పక్కన లిటిల్ ఏంజెల్స్ స్కూల్ యాజమాన్యం నా కూతురుకు విద్యాభ్యాసం గురించి ప్రశ్నించినందుకు నాపై దాడి చేశారని నాకు న్యాయం చేయాలని బాధితుడు బుజ్జి రెడ్డి, భార్య, పిల్లలు కలిసి జిల్లా ఎస్పీ కృష్ణ కాంత్ ను ఆశ్రయించారు. నెల్లూరు లోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా వేదిక పరిష్కారం లో ఎస్పీ కృష్ణ కాంత్ కు వినతి పత్రం అందజేశారు. ఆ స్కూలు పై చర్యలు తీసుకోమని ఆశ్రయిస్తే మాపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపిస్తామని స్కూలు యాజమాన్యం మాకు బెదిరిస్తున్నారని బాధితుడు బుజ్జి రెడ్డి ఎస్పీకి వివరించారు.

టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజయభేరి

విశాలాంధ్ర-కందుకూరు రూరల్ : ఆంధ్ర కేశరి యూనివర్శిటీ డిగ్రీ రెండవ సెమిస్టర్ ఫలితాలలో టీ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు విజయభేరీ మోగించారు. పొలిటికల్ సైన్స్, ఎకనామిక్స్,స్పెషల్ తెలుగు సబ్జెక్టులందు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. స్పెషల్ ఇంగ్లీష్ నందు 93%, హిస్టరీ నందు 89% ,కెమిస్ట్రీ నందు 80%,బోటనీ యందు 73%,మాథమెటిక్స్ నందు 64%,డేటా సైన్స్ లో 71% ఉత్తీర్ణత సాధించారు.ఎస్కే సైదాబీ ఫండమెంటల్స్ ఆఫ్ అకౌంట్స్ నందు 80 మార్కులు, ఉర్దూలో 86 మార్కులు, కామర్స్ ఓఎటిలో 74 మార్కులతో టాపర్ గా నిలిచింది.ఆర్. మహేష్ మరియు కె. నాగేంద్రబాబు 96 మార్కులతో స్పెషల్ తెలుగులో, కె. శివకుమార్ మరియు జైస్వాల్ లు ఇంగ్లీషులో 92 మార్కులతో, కెమిస్ట్రీలో పి.అశ్విని 89 మార్కులతో, సి ప్రోగ్రామింగ్ లో డి. హరిత 72మార్కులతో, డేటా సైన్స్ లో ఎల్. బాల చిన్నమ్మ 86 మార్కులతో, హిస్టరీ మరియు పొలిటికల్ సైన్స్ సబ్జెక్టులందు ఎం. చిన్నబాబు 86 మార్కులతో ఫైనాన్షియల్ సర్వీసెస్ నందు వై. శృతి ఉత్తీర్ణత సాధించి టాపర్స్ గా నిలిచారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవికుమార్ మరియు అధ్యాపక సిబ్బంది విద్యార్థులను అభినందించారు.

రాపూరు మండల తాహశిల్దార్‌గా శ్యామసుందర్ రాజు

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండల నూతన తహశిల్దార్‌గా యం. శ్యాంసుందర్ రాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా రాపూరు తహశిల్దార్‌గా శ్యామసుందర్ రాజు నియమితులయ్యారు. శ్యామసుందర్ రాజు గతంలో రాపూరు మండలంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా, డిప్యూటీ తహశిల్దార్‌గా, తహశిల్దార్‌గా విధులు నిర్వహించి మంచి అధికారి గా పేరు తెచ్చుకున్నారు. తిరిగి మండలానికి రావడంతో మండలం లోని అన్ని సమస్యలపై అవగాహన వున్న ఆయన వాటి పరిష్కారానికి కృషి చేస్తారని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

టిబి రాకుండా అడ్వాన్స్ వ్యాక్సిన్ కార్యక్రమం

విశాలాంధ్ర-రాపూరు: రాపూరు మండలంలోని వెపినాపి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ప్రమీలా రాజ్యం కుమారి, డాక్టర్ సుదర్శనమ్ పర్యవేక్షణ లో 60 సంవత్సరాలు పైబడిన, షుగర్ బి పి, మద్యం, పొగాకు తీసుకోనె వారికి టీబి రాకుండా ప్రతి సోమవారం, గురు వారాల్లో వ్యాక్సిన్ వేయబడుతుంది. అందులో బాగంగా సోమ వారం రాపూరు కోత్తపెటలోని హిందూ పాఠశాలలో బిసిజి వ్యాక్సిన్ వెయబడుతుందని సీనియర్ ట్రీట్ మెంట్ సూపర్ వైజర్ శ్రీనివాసులు రెడ్డి, కాంతమ్మ తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ట్రీట్మెంట్ సూపర్ వైజర్ శ్రీనివాసులు రెడ్డి, సూపర్ వైజర్ సుప్రజ, ఎఎన్ఎం కాంతమ్మ, మెల్ అసిస్టెంట్ వరద య్య, అశాలు కవిత నారాయణమ్మ శ్రీదేవి, లక్ష్మీ పాల్గొన్నారు.

సమావేశ మందిర నిర్మాణం ఎప్పుడో.?

విశాలాంధ్ర-ఉదయగిరి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న సమావేశ మందిరం కూలిపోయి సంవత్సరాలు గడుస్తున్నా నిర్మాణానికి నోచుకోలేదు. మండల స్థాయి సమావేశం ఏదైనా కార్యాలయ ఆవరణంలోని స్త్రీ శక్తిభవన్‌లో అధికారులు జరుపుకుం టున్నారు. మండల సర్వసభ్య సమావేశమైనా ఇతర శాఖల రివ్యూ మీటింగ్ లైనా స్త్రీ శక్తి భవన్ లో నిర్వహించుకుంటున్నారు. విశాలమైనటువంటి పాత సమావేశ మందిరం కూలిపోయిన ప్రదేశంలో నూతన మందిరం నిర్మించేందుకు అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఒక్కప్పటి సమితి భవనం ఇప్పుడు ఎంపిడిలో కార్యాలయంగా ఉంది. అందులో ఒక అతిధి గృహంతో పాటు వివిధ శాఖలకు ప్రత్యేక గదులు కూడా ఉన్నాయి. అప్పట్లో ఎంతో ప్రణాళికా నిర్మించిన ఈ భవనం ప్రస్తుతం శిధిలావస్థలో ఉంది. సంబందించిన శాఖ అధికారులు స్పందించి భవనం మరమత్తులు చేయించటంతో పాటు సమావేశమందిరానికి పైకప్పు వేస్తే బాగుంటుందని పలువురు అంటున్నారు.

బోగోలు నూతన తాసిల్దారుగా సురేష్ బాబు

విశాలాంధ్ర-బిట్రగుంట: బోగోలు నూతన తాసిల్దారుగా ఎం.సురేష్ బాబు సోమవారం బాధ్యతలు చేపట్టాడు. కలిగిరి మండలంలో సివిల్ సప్లై డిప్యూటీతాసిల్దారుగా విధులు నిర్వర్తిస్తూ వ్యక్తిగత కారణాలచేత కొంతకాలంగా సెలవులోఉన్న ఆయన ప్రభుత్వ ఆదేశాలమేరకు బోగోలు మండల తాసిల్దారుగా విధులలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు చట్ట పరిధిలో ప్రజా సమస్యలకు పరిష్కారం చూపుతామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీతాసిల్దార్ జూలియాభాయ్, సీనియర్ సహాయకురాలు విజయలక్ష్మి, కార్యాలయసిబ్బంది గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు ఉన్నారు.

బుడ్డి డ్రైన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

విశాలాంధ్ర-ముత్తుకూరు : మండలంలోని రంగాచార్య కండి వద్ద బుడ్డి డ్రైన్ లో రాత్రి వేళలో కొందరు భారీ అంతరాలతో మట్టిని తవ్వి కాలువ గట్లపై వేయడం జరిగిందని స్థానికులు స్థానిక శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి వివరించారు. దీంతో ఆ మట్టి తరలించేందుకు కొందరు రాత్రి వేళలో ట్రాక్టర్లు, వారి యంత్రాలతో అక్కడికి రావడంతో తాము అడ్డుకోవడం జరిగిందన్నారు. దీంతో వారు అక్కడి నుంచి పరార్ అయ్యారని ఆయన తెలిపారు. వెంటనే స్పందించిన సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కాలువలో మట్టి లోతుగా తీయడం దానిని తరలించడం తప్పు కాబట్టి వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు దాసరి సీనయ్య, నాగరాజు, అలుముత్తు, శివ ప్రసాద్, పల్లాల్ రవీంద్ర, ఈదురు రామ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో " ప్రజాదర్బార్ " వినతులు స్వీకరించిన అబ్దుల్ అజీజ్.

మంగళగిరి లోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పామర్రు నియోజకవర్గ శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా, టీడీపి జాతీయ ఉపాధ్యక్షులు బొల్లినేని రామారావు లతో కలిసి నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ సోమవారం " ప్రజాదర్బార్ " గ్రీవెన్స్ లో పాల్గొని ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు.

స్మశాన దొరువు దురాక్రమణను అరికట్టండి

తహశిల్దారుకు సిపిఐ నేతల విజ్ఞప్తి

విశాలాంధ్ర-ముత్తుకూరు : పంటపాలెం దళితులు స్మశానం పక్కనే ఉన్న రేవులు వేసుకునే దొరువును ఆక్రమించి రియల్ ఎస్టేట్‌గా మార్చేశారని సిపిఐ నాయకులు సోమవారం తహసిల్దార్ బాలకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ పంటపాలెం దళితవాడకు చెందిన దళితులు స్మశానంలో చనిపోయిన వారిని పూడ్చిపెట్టి పెద్దకర్మ రోజునదొరువు లో మునిగి రేవులు వేసుకునే వారిని దొరువును కొందరు రియల్ ఎస్టేట్లో కలుపుకొని ఆ గుంటను పూడ్చివేసి ప్లాట్లుగా మార్చేశారని అందువల్ల తమకు రేవులు వేసుకునేందుకు దొరువు లేకుండా చేశారని తక్షణం తమకు మా గుంటను తిరిగి ఇవ్వాల్సిందని కోరారు. తాసిల్దార్ బాలకృష్ణారెడ్డి సర్వేయర్ ను పిలిపించి వారికి దొరువు రౌండ్ గా చూపించాల్సి ఉంటుందని చెప్పగా, ఆ భూమి రోడ్డుకు పోయిందని అందువల్ల చూపించలేమని సర్వేయర్ చెప్పడంతో బాలకృష్ణారెడ్డి రౌండ్ గా చూపించాల్సి ఉంటుందని పడవగా చూపించడం ఏమిటని ప్రశ్నించాడని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సర్వేపల్లి కన్వీనర్ కొమరి నందయ్య, మండల కార్యదర్శి తుంగ ఏడుకొండలు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు కాకి వెంకట శేషయ్య, వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం :పద్మజ

విశాలాంధ్ర -మనుబోలు: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరం అని వెంకటాచలం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మనుబోలు మండలం మడమనూరు సెక్టార్ సూపర్వైజర్ పద్మజ అన్నారు. ఆగస్టు ఒకటి నుండి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జిల్లా పిడి హేనాసుజన ఆదేశాల మేరకు వెంకటాచలం సిడిపిఓ విజయలక్ష్మి సూచనతో కొమ్మలపూడి గ్రామ (ఎస్టీ) కొమ్మలపూడి (ఎస్సి)చెరుకుమూడి గ్రామ అంగన్వాడి కేంద్రాలు కలిసి సోమవారం ముద్దుమూడి గ్రామ అంగనవాడి కేంద్రంలో ఐసిడిఎస్ సెక్టార్ సూపర్వైజర్ పద్మజ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ మోహన్‌రావు, వెంకటేశ్వర్లు, రమణమ్మ, అంగన్వాడి వర్కర్లు సురేఖ, సీతారావమ్మ, సంతోషమ్మ, రమణమ్మ, ఆయా రత్నమ్మ, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ పంపిణీ చేసిన టిడిపి యువ నేత

విశాలాంధ్ర -మనుబోలు: నూతన పెన్షన్ పంపిణీ చేసిన టిడిపి నాయకులు. ఈ సందర్భంగా సోమవారం మండలంలోని వీరంపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో ఉన్న మంగళపూరి మమత భర్త అయిన మంగళపూరి మనోహర్ అనే వ్యక్తి ఏడు నెలల కిందట డయాలసిస్ వ్యాధితో చనిపోయారు. అప్పుడు అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కానీ నాయకులు గాని ఆ కుటుంబానికి ఎటువంటి సహాయం అందించలేకపోగా నిర్దాక్షిణ్యంగా ఆమెకు రావలసిన వితంతు పెన్షన్ కూడా ఆపివేయడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు మన్నారపు రఘురామయ్య, పొట్టేళ్ల ప్రసాద్, వనం ఏడుకొండలు, పాలెపు పెంచలయ్య, పలిగిలి రామకృష్ణ, మరియు టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆమెకు గత ఏడు నెలల నుండి ఇప్పటివరకు 1500 చొప్పున వితంతు పెన్షన్ను అందిస్తున్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర-ఉదయగిరి : మండల పరిధిలోని కొండాయపాలెం పంచాయతీ గంగిరెడ్డి, దుర్గం పల్లి మాసాయి పేట, వెంకటరావు పల్లి, గానుగ పెంట పల్లి దేకురుపల్లి అంగన్వాడీ సెంటర్ల కార్యకర్తలు సంయుక్తంగా సోమవారం తల్లిపాల వారోత్సవాలు గంగిరెడ్డిపల్లిలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కే అనిత, పద్మ, నరసమ్మ, లక్ష్మమ్మ, జయమ్మ, సుగుణ, ఆరోగ్య సిబ్బంది ఏఎన్ఎం సుప్రజ, సూపర్వైజర్ వై చెన్నయ్య, కే శ్రీనివాసులు, విజయలక్ష్మి, మహిళా పోలీస్ ఎన్ నాగవనిత, ఆశా కార్యకర్తలు తల్లులు బాలింతలు గర్భవతులుపాల్గొన్నారు.

ఎన్డీఏ ప్రభుత్వం పేద ప్రజల ఇళ్లకు వరం : బోలా శీను

విశాలాంధ్ర-మనుబోలు : ఎన్డీఏ ప్రభుత్వం పేద ప్రజల ఇళ్లకు వరంగా మారిందని జిల్లా బిజెపి నేత బోలా శ్రీను పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్లో మెజారిటీ ప్రజల ఆశల, అభిప్రాయాల ప్రకారం ఎన్డీఏ ప్రభుత్వం నడవడం మొదలైందని అనిపిస్తుంది. ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల బదలీల నుండి నిజాయితీ గల అధికారులను సరైన స్థానాలకు పంపించడం నుండి, టీటీడీకి భక్తుల కోరిక ప్రకారం నడుచుకుంటున్న యంత్రాంగం నుండి పాలన మొదలైందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన క్రింద ఇల్లు లేని నిరుపేద ఉండకూడదు అనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఇతోదికంగా సహాయం చేస్తూ ఇంటి నిర్మాణాలకు సహాయ పడుతుందన్నారు. ఒక ఇంటికి పూర్తిగా ఉచితంగా కేంద్ర ప్రభుత్వం 2,50,000, రాష్ట్ర ప్రభుత్వం1,50,000 కలిపి నాలుగు లక్షలు ఇస్తుంది. పట్టణ ప్రాంతాల్లో అధికంగా 30 వేల రూపాయలు తిరిగి చెల్లించే విధంగా అప్పు సదుపాయం కల్పిస్తుందన్నారు.

తల్లిపాలు బిడ్డలకు రక్షణ కవచాలు

విశాలాంధ్ర-రాపూరు: తల్లి పాలు వారోత్సవాలు రాపూరు ఐసిడిఎస్ పరిధిలోని అన్ని అంగన్వాడి సేక్టార్ లలోని అంగన్ వాడి కేంద్రాలలో ఐసి డిఎస్ ప్రాజెక్టు పరిధిలో సిడిపిఓ సునంద పర్యవేక్షణలోనవాపేట గ్రామంలోని అంగన్ వాడి కేంద్రంలో సూపర్ వైజర్ ధనమ్మ బాలింతలకు గర్భవతు లకు తల్లి పాలు విశిష్టత గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ ధనమ్మ, కార్యకర్తలు బొక్కసం సుభాషిణి, ఆదిలక్ష్మీ, ఉమాదేవి, ఎడబూ హెచ్ పద్మా, బాలింతలు, గర్భవతులు పాల్గొన్నారు. వెపినాపి సేక్టర్ పరిధిలోని గిలకపా డు అంగన్వాడి కేంద్రంలో సూపర్ వైజర్ సౌజ న్య అద్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో వెపినాపి ప్రాధమిక ఆరోగ్య కేంద్రం వైద్యదాదికారణి ప్రమీలా రాజ్యకు మారి, ఎంఎల్ హెచ్ పి లక్ష్మీ ప్రియ, ఎఎన్ఎం శ్రీలక్ష్మీ, అంగన్వాడి కార్యకర్తలు కవిత, సుమతి, అంకమ్మ, రత్నమ్మ, యశోద, సుభాషిణి పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలను తనిఖీచేసిన ఎంఈఓ

విశాలాంధ్ర-ఉదయగిరి: మండలం పరిధిలోని దుర్గం పల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను స్థానిక మండల విద్యాధికారి తోట శ్రీనివాసులు సోమవారం తనిఖీ చేశారు మొదటగా పాఠశాల విద్యార్థిని విద్యార్థులు పఠన అభ్యసన సామర్థ్యాలను, పాఠశాల అన్ని రికార్డులను, డొక్కా సీతమ్మ మధ్యాహ్నబడి భోజనం పరిశీలించి పాఠశాలలో మొక్కలను నాటారు. మెనూ ప్రకారము ప్రతిరోజు మధ్యాహ్నం భోజనం రుచి శుచి వుండాలనిభోజన కార్మికులకు ప్రధానోపాధ్యాయులకు తెలియజేశారు. మనబడి మనబడి మన భవిష్యత్తు పనులైన నూతన టాయిలెట్స్ నిర్మాణం, హ్యాండ్ వాష్ పాయింట్స్, ఫుట్‌పాత్‌లను చాలా నాణ్యతగా నిర్మించిన ప్రధానోపాధ్యాయులు షేక్ జాఫర్ అహ్మద్ అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

తాహసిల్దార్ ను కలసిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ

విశాలాంధ్ర -మనుబోలు: మనుబోలు తహసిల్దార్ సిహెచ్. సుబ్బయ్యను ఎంపీపీ వజ్రమ్మ, వైస్ ఎంపీపీ తిక్కవరపు వెంకటరమణారెడ్డి సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా బొకేతో తాహసిల్దారును సత్కరించారు. మనుబోలు మండలంలో పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో నెట్ క్యబ్ చైర్మన్ దాసరి భాస్కర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

కొండాపురం తాసిల్దారుగా సుందరమ్మ

విశాలాంధ్ర -కొండాపురం: మండల కేంద్రమైన కొండాపురంలోని స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో సోమవారం తాసిల్దార్ కె వి బి సుందరమ్మ బాధ్యతలు స్వీకరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరు కలిసి మెలిసి తనకు సహకరించాలని మండల వివిధ పార్టీ నాయకులను కోరారు అలాగే మండల ప్రజలు రెవెన్యూ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని వస్తే సత్వరగా పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు

ఇతర వెనుకబడిన తరగతుల సంక్షేమ కమిటీ సభ్యులుగా బీదమస్తాన్ రావు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : ఇతరవెనుకబడినతరగతుల సంక్షేమ పార్లమెంటు కమిటీకి జరిగిన ఎన్నికలలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు గారు ఎన్నికైనట్లుగా రాజ్యసభ పార్లమెంటరీబుల్లెట్ అధికారికంగాధ్రువీకరించింది.మొదటి సిట్టింగ్తేదీనుండిఒకసంవత్సరం ఈకమిటీలో సభ్యత్వంఉంటుంది.బీద మస్తాన్ రావు తోపాటు 9 మంది పార్లమెంటు సభ్యులు ఈ కమిటీకి ఎంపికయ్యారు. పార్లమెంటరీ ఓబీసీ సంక్షేమ కమిటీకి ఎంపికైనందుకు మాజీ సీఎం జగన్ వైసీపీ రాజ్యసభఫ్లోర్లీడర్ విజయసాయి రెడ్డికి, వైవి సుబ్బారెడ్డికి బీద మస్తాన్ రావు ధన్యవాదాలు తెలిపారు. బీదమస్తాన్రావుమాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 బికింద ఏర్పాటైన వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్ సమర్పించే నివేదికలను పరిగణలోకి తీసుకోవడం కేంద్రప్రభుత్వ కేంద్రపాలితప్రాంతాలపరిధిలోని అంశాలపై తీసుకున్న చర్యలను ఉభయ సభలకు నివేదించడం కమిటీ లక్ష్యమన్నారు.

రాజకీయాలకు స్వస్తి..దైవ చింతనకు ప్రాధాన్యం :అళహరి చిట్టిబాబు

విశాలాంధ్ర- నెల్లూరు టౌన్ :రాజకీయాల నుంచి తప్పుకుంటున్నానని ఇకపై దైవ కార్యక్రమంలో మునిగితేలుతానని కావలి మండలం తుమ్మలపెంటకు చెందిన వైసిపి నాయకుడు అళహరి చిట్టిబాబు అలియాస్ ప్రసాద్ పేర్కొన్నారు. నెల్లూరులో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి, కావలి కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే కలికి యానాది రెడ్డి శిష్యుడుగా తాను రాజకీయ అరంగేట్రం చేశామన్నారు. నెల్లూరు జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా పనిచేశానని వివరించారు. కావలి మండల కాంగ్రెస్ కన్వీనర్గా కూడా పనిచేశానని ఆయన పేర్కొన్నారు. కో-ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్గా, అగ్రికల్చర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్గా కూడా తాను పనిచేశానని వివరించారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత వైసీపీలో కొనసాగానన్నారు. తమ ఆధ్వర్యంలో తుమ్మలపెంటలో సాయిబాబా ఆలయం నిర్మించినట్లు తెలిపారు. ప్రస్తుతం బాబా ఆలయం కమిటీ చైర్మన్గా కొనసాగుతున్నానన్నారు. తాను ఒక పార్టీలో ఉన్నందువల్ల బాబా ఆలయానికి రాజకీయరంగు అంటుకునే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పూర్తిగా రాజకీయాలనుంచి విరమించుకొని బాబా ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. శేష జీవితమంతా బాబా సేవకే అంకితమన్నారు. చిట్టిబాబు రాజకీయాలకు స్వస్తి పలకడం కావలి మండలంలో వైసీపీకి తీవ్ర నష్టమే.

అదానివరల్డ్ స్కూల్లో భాషా వారోత్సవాలు

విశాలాంధ్ర బ్యూరో నెల్లూరు : కృష్ణపట్నం లోని అదాని వరల్డ్ స్కూల్లో సోమవారం భాషా వార్షికోత్సవాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. ఈ ఉత్సవాలు వారం రోజులపాటు నిర్వహించనున్నారు. అందులో భాగంగా మొదటిరోజుఅదాని వరల్డ్ స్కూల్, అదాని సైనిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సత్యనారాయణ సిరియాల జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అకాడమిక్ హెడ్ వారోత్సవాల బ్యానర్ని ఆవిష్కరించారు.సైనిక్ విద్యార్థుల ప్రార్థన గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదాని వరల్డ్ స్కూలు విద్యార్థులు ఆంగ్లం, హిందీ లోనూ రోల్ ప్లే నిర్వహించారు. విద్యార్దులు తెలుగు ,ఆంగ్ల భాషా సంభంధిత నృత్యాలు చేసి అలరించారు. విద్యార్థులు త్రిభాషా సూత్రం తో మూడు భాషల్లోను మాతృభాష గొప్పదనాన్ని వర్ణిస్తూమాట్లాడారు. పాటలు పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ మాతృభాషను మరవొద్దు అన్యభాషలు విడవొద్దు. ప్రపంచంలో ఎక్కడకి వెళ్లిన మాట్లాడాలి అంటే భాష పై పట్టుఉండాలి,అందుకుమన దేశంలో త్రి భాషా సూత్రాన్ని అమలుచేసారన్నారు. తద్వారా విద్యార్థులు భాషపై పట్టుసాధించి విజయలు సాధిస్తారాని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న అకాడమిక్ ఇంచార్జ్ రాబిన్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం -2020 ప్రకారం ప్రతి విద్యార్థి ప్రాంతీయ భాషపై అవగహనతో కూడిన విద్య అమలు చేయాలని తెలిపిన విధంగా ఈభాషా వారోత్సవాలను నిర్వహించడం జరుగుతోందని తెలియజేశారు.ఆంగ్ల,హిందీ తెలుగు భాషోపాధ్యాయులు నిర్వహించిన కార్యక్రమాలను ప్రశంశించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయబృందం పాల్గొన్నారు.

నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరించండి - అదనపు కమిషనర్ శర్మద

విశాలాంధ్ర- నెల్లూరు కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను నెల్లూరు నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ విభాగం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించారు. అదనపు కమిషనర్ శర్మద పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అనధికార కట్టడాలు, కాలువల పూడికలు, ఆస్తి పన్నులకు సంబందించిన అంశాలపై ప్రజల నుంచి అందు కున్న సమస్యలకు నిర్ణీత సమయంలోగా పరిష్కారం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వర్షాకాలపు సమస్యలను అధిగమించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని, అండర్ బ్రిడ్జిలలో వర్షపు నీరు నిల్వకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. అన్ని డ్రైను కాలువల్లో పూడికతీత, సిల్ట్ తొలగింపు పనులను చేపట్టాలని సూచించారు. గత వారం అందుకున్న 54 విజ్ఞప్తులలో 41 ఫిర్యాదులకు శాశ్వత పరిష్కారం అందించామని, పెండింగులోని 13 ఫిర్యాదుల స్థితిగతులపై విభాగాల వారీగా అధికారులతో సమీక్షించి ఈ వారంలో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రస్తుతం అందుకున్న వినతులు పునరావృతం కాకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో శాశ్వత పరిష్కారం అందించాలని అదనపు కమిషనర్ సంబంధిత సెక్షన్ అధికారులకు సూచించారు. విభాగాల వారీగా ఇంజనీరింగ్ - 5, టౌన్ ప్లానింగ్-12, పబ్లిక్ హెల్త్-3, ఎస్టాబ్లిష్మెంట్-1, మొత్తం 21 ఫిర్యాదులను ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకు న్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నగర పాలక సంస్థ ఇంజనీరింగ్ ఎస్.ఈ సంపత్ కుమార్, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ చైతన్య, సిటీ ప్లానర్ దేవీ కుమారీ, మేనేజర్ ఇనాయతుల్లా, టి.పి.ఆర్.ఓ.ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన మొహరం వేడుకలు

విశాలాంధ్ర-వరికుంటపాడు: మండలంలోని విరువూరు గ్రామంలో అనాదిగా మొహరం వేడుకలు (పీర్ల పండుగ) గ్రామంలోని అన్ని సామాజిక వర్గాలు ఏకమై నాలుగు రోజులు పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. కానీ గత ఏడాది కొన్ని వివాదాల వల్ల, రాజకీయ కారణాలతో మొహరం వేడుకలు అర్ధాంతరంగా ఆగిపోయింది.ఈ క్రమంలో ఉదయగిరి శాసన సభ్యులు కాకర్ల సురేష్ను గ్రామ నాయకులు కలిసి పరిస్థితిని వివరించారు. ఆయన సంబంధిత అధికారులకు మొహరం వేడుకలు జరిగేలా ఆదేశించారు. మొహరం వేడుకలు కన్నుల పండుగగా జరిగాయి. బంధుమిత్రులతో విరువూరు గ్రామంలో సందడి నెలకొంది. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ మాట్లాడుతూ దైవ కార్య క్రమాలు భక్తితో నిర్వహించుకోవాలని, కక్షలతో రాజకీయ దురు ద్దేశాలతో కాదన్నారు. ఉదయగిరి సీఐ గిరిబాబు, వరికుంటపాడు సబ్ ఇన్స్పెక్టర్ తిరుపతయ్యలు బందోబస్తు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాలెం వెంకటసుబ్బారెడ్డి, గడ్డం నర్సారెడ్డి, డాక్టర్ షేక్ చిన్న మస్తాన్, డాక్టర్ మహబూబ్ బాషా, పటాన్ రహిమాన్ ఖాన్,మౌలాలి, మాలెం రఘు రాములు,నాగేశ్వరరావు, మాలెం తిరుపతిరెడ్డి, మాలెం రామ్ మోహన్ రెడ్డి, షేక్ ఖాజావలి (చీరాల), పాలుగుల్ల శ్రీనివాసరెడ్డి, మాధవరెడ్డి, నాగేశ్వరరావు, కాశిరెడ్డి, తిరుపతిరెడ్డి, సరాబు చంద్ర పాల్గొన్నారు.

రిపోర్టర్ బెన్ని కుటుంబానికి మిడియా మిత్రులు అర్ధిక సాయం

విశాలాంధ్ర-రాపూరు:రాపూరులో పలు టీవి చానల్లో రిపోర్టర్గా పనిచేస్తూ అనారోగ్యంతో అకస్మికంగా మృతి చెందారు. స్థానికుడు (ముస్లిం) బెన్ని (38) ఆర్థికంగా ఇబ్బందులు బార్య, కూతురు (7)వారి కుటుం బానికి తమవంతు సహాయం చేశారు. రాపూరు మండల ప్రింట్, ఎలక్ట్రానిక్ యుట్యూబ్ వీలేకర్లు, అతని అబిమానులు వద్ద లక్ష రూపాయలను కూతురు మీద డిపా జిట్ చేశారు. సంబందించిన పత్రాలను 40 దినాల (కర్మక్రియల) కార్యక్రమంలో వారి కుటుంబానికి మిడియా కుటుంబ సభ్యులు మా సహకరం వుంటుందని దైర్యానిచ్చారు.

మనుబోలు తహసిల్దార్గా సుబ్బయ్య బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర -మనుబోలు: మనుబోలు తాహసిల్దార్ సిహెచ్ సుబ్బయ్య బాధ్యతలు సోమవారం స్వీకరించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఏమైనా రెవెన్యూ సమస్యలు ఉంటే సోమవారం జరిగే గ్రీవెన్స్లో అర్జీలు అందజేయాలని కోరారు. సోమవారం గ్రీవిన్స్లో అన్ని డిపార్ట్మెంట్లో అందుబాటులో ఉంటాయి కాబట్టి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ముఖ్యంగా ఆయా గ్రామాల్లో రెవెన్యూ సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. మండల స్థాయి రెవెన్యూ సమస్యలు ఉంటే ఆర్డిఓ జెసి కలెక్టర్ ద్వారా పరిశీలించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాహసిల్దార్ శివప్రసాద్, మండల సర్వే శ్రీనివాసులు, సీనియర్ అసిస్టెంట్ అమీర్ భాషా, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సుధీర్, వీఆర్వో నాగార్జున రెడ్డి, శ్రీనివాసులు, అఖిల్, బుజ్జయ్య, సుబ్రహ్మణ్యం, భగవాన్, నాగేశ్వరరావు, సచివాలయ సర్వేలు మధు ,వంశీ,శివ, రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

విశాలాంధ్ర- మనుబోలు: తల్లిపాలు అమృతంతో సమానమని మనుబోలు సెక్టార్ సూపర్వైజర్ రమణ మన్నారు. జిల్లా పిడి హేనాసుజనా ఆదేశాల మేరకు వెంకటాచలం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ విజయలక్ష్మి సూచన మేరకు ఐసిడిఎస్ సూపర్వైజర్ ఆధ్వర్యంలో మండలంలోని అరుందతీ వాడ అంగన్వాడి కేంద్రంలో సోమవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ సిహెచ్ రమణమ్మ మాట్లాడుతూ బాలింతలో గర్భవతులు మహిళలకు తల్లిపాల శిష్టతపై అవగాహన కల్పించామన్నారు. తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెంపొందిస్తాయని, బిడ్డ పుట్టినప్పటినుంచి సంవత్సరం వరకు తల్లిపాలు ఇవ్వాలన్నారు, పౌష్టికాహారంతో పాటు రెండేళ్లు నిండే వరకు తల్లిపాలు కొనసాగించాలని గర్భవతులు చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాజేశ్వరి అంగన్వాడి వర్కర్లు: లక్ష్మి ,సుజనా, సుగుణమ్మ ,నిర్మల, విజయమ్మ ,మునెమ్మ, గర్భవతులు, బాలింతలు ఉన్నారు.

ఆగని తెల్ల రాయి తవ్వకాలు..ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతార్

విశాలాంధ్ర-ఉదయగిరి : గత ప్రభుత్వం చేసినటువంటి ఖనిజ సంపద దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ నూతన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత స్థానిక శాసనసభ్యులు కాకర్ల సురేష్ నియోజకవర్గంలో అక్రమ తెల్ల రాయి తవ్వకాలు జరపొదంటూ ఆదేశించారు. స్వయానా శాసనసభ్యులు ఆదేశాలు బేఖాతలు చేస్తూ తెల్ల రాయి తౌఖం దారులు మాత్రంనిరంతరం తెల్లరాయి తవ్వి అక్రమ రవాణా చేస్తూనే ఉన్నారు. మండల పరిధిలోని ఆర్లపడియా, వెంకట్రావుపల్లి సర్వారాబాదు తిరుమలపురం సీతారామపురం మధ్య మార్గంలో యదేచ్ఛగా తెల్ల రైతవ్వకాలు జరుగుతూనే ఉన్నాయి. గత ప్రభుత్వంలో నియోజకవర్గంలో అక్రమ తెల్ల రాయి తవ్వేందుకు అధికారులే మామూలు నిర్ణయించిన సందర్భాలు ఉన్నాయి.నూతన శాసనసభ్యులు అలాంటి నీచమైన సంస్కృతికి చరమగీతం పాడి ఖనిజ సంపదను కాపాడాలన్న ఉద్దేశంతో తెల్ల రాయి తవ్వకాలు జరపొదంటూ ఆదేశాలు జారీ చేశారు. శాసన సభ్యుని మాటను బేఖాతరు చేస్తూ అక్రమార్కులు తెల్లరాయి తవ్వకాలు కొనసాగిస్తూనే ఉన్నారు. మైనింగ్ అధికారులు కానీ రెవెన్యూ అధికారులు కానీ అటవీ శాఖ సరిహద్దుల్లో రాయి తవ్వుతున్నప్పటికీ ఫారెస్ట్ అధికారులు కానీ అటువైపు కన్నెత్తి చూడకపోవడం విశేషంగా చెప్పుకుంటున్నారు.కేవలం నలుగురు వ్యాపారులు మాత్రమే తెల్లరాయి తవ్వకాలు జరుపుతూ ఉంటే వారిలో ముగ్గురు ఉదయగిరిలో ఉండడం విశేషం. ఆ ముగ్గురిలో ఒకరు మాత్రమే తెల్ల రాయి తవ్వకాలలో ముందడుగు వేసి ప్రభుత్వం ఏదైనా తమదే చెల్లుబాటు అంటూ తవ్వకాలు సాగిస్తున్నారు. స్థానిక మండలం నుంచి ఒక వ్యక్తి మైనింగ్ శాఖకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గత నెలలో మైనింగ్ శాఖ ఉన్నత అధికారి రెండు రోజులపాటు రోడ్లు భవనాల శాఖ అతిథి గృహంలో బస చేసి విచారించినా తెల్లరాయి తవ్వకం దారుల ఆచూకీ కనిపెట్టలేకపోవడం విశేషం. తెల్లరాయి తవ్వకం దారులు అందరికీ తెలిసినా.. విచారణకు వచ్చిన అధికారులకు తెలియకపోవటం విశేషం.

విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
విలేకరులు కావలెను
విశాలాంధ్ర తెలుగు జాతీయ దినపత్రికలో నెల్లూరు జిల్లాల్లో
దిగువ తెలిపిన మండలాల్లో పనిచేయుటకు స్థానికంగా ఉన్న అభ్యర్థులు కావలెను.
ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తెలుగుభాషపై పరిజ్ఞానం ఉండాలి.
పనిచేయవలసిన మండలాలు :
నెల్లూరు రూరల్, కావలి, కావలి రూరల్, ఆత్మకూరు, ఎ.ఎస్.పేట, కలువాయి,
సైదాపురం, పొదలకూరు, టి.పి.గూడూరు, వెంకటాచలం, ఇందుకూరుపేట,
చేజర్ల, కోవూరు, బుచ్చిరెడ్డిపాలెం, సంగం, అల్లూరు, దుత్తలూరు.
వింజమూరు, కొడవలూరు, దగదర్తి
గమనిక: ఆయా మండలాల్లో స్థానికులై ఉండాలి
సంప్రదించవలసిన నెంబరు: 8074872332